
Powerpet
Nagar
Eluru
అదృష్టం
(నవల)
నండూరి వెంకట సుబ్బారావు


Powerpet
Santhi
Nagar
ain Bazar
Eluru
South
అదృష్టం
ధవళ్ళ
నండూరి వెంకట సుబ్బారావు

# Adrushtam, Telugu Novel by

# Nanduri Venkata Subba Rao

An entry version to Kinige Navala Competetions

Copy Right : Author

Pages : 252

DTP & Layout : N. Suri

(9951748340)

Price : Rs. 125

# ముందుమాట

మొక్కలు నాటేందుకోసం పెరట్లో తవ్వుతూ ఉంటే లంకెల బిందెలు తగలడం చిన్నప్పుడు చందమామ కథల్లో చదివి ఊహాలోకాల్లోకి వెళ్లని పిల్లలుండరు. డబ్బు కష్టాలు, పేదరికం  వల్ల వచ్చే ఇబ్బందులు ఎదురైనప్పుడల్లా మనక్కూడా లంకెల బిందెలో, డబ్బు సూట్ కేసులో దొరికితే బాగుండు అనుకోవడం సామాన్యమానవ సహజం. అయితే డబ్బు లేకపోవడం వల్ల వచ్చే కష్టాలకన్నా; అకస్మాత్తుగా డబ్బు వచ్చి పడటం వల్ల కలిగే కష్టాలు చిత్రంగా ఉంటాయి. అలాంటి చిత్రమైన ఊహకు తార్కికమైన రూపం ఈ నవల. సరదాగా చదివించాలని చేసిన తొలిప్రయత్నం. చదివి ఆదరించండి. మీ ఆలోచనలు పంచుకోండి.

**-రచయిత**




అదృష్టం అంటే తెల్లారితే తిండి మాటేంటి అన్న చింత ఈపూటకి లేకపోవడం.

అదృష్టం అంటే తెల్లార్లూ మన సొమ్ముకి కాపలా ఏంటి అన్న బాధ రాత్రంతా లేకపోవడం.

అదృష్టం అంటే గొప్పగొప్ప కలలు రావడం కాదు.... పిడుగుపడినా మెలకువ రానంత గాఢంగా నిద్రపోగలగడం.

తెల్లవారకముందే లేచి పొద్దును శాసించే పనిమంతులు కొందరు... వీలును బట్టి లేచాక పొద్దెంత అయ్యిందో చూసుకునే అదృష్టవంతులు కొందరు.

ఏదో తొందర పని ఉన్నవాడికి మల్లే సూరీడు పొద్దున్నే ఉదయించేశాడు. అంతకంటే ముందే పల్లె మేలుకుంది. పట్నం హంగులు ఇప్పుడిప్పుడే సంతరించుకుంటున్న ఊరది. పొలాల్లోకి వెళ్లే రైతులు, జాగింగ్ పూర్తి చేసి ఇళ్లకు వెళ్లే జనాలు, బళ్లు, ఆటోలు అన్నింటినీ సెంటర్ దాకా చేర్చి టీల కోసం, టిఫిన్ల కోసం ఆగినవారితో అక్కడి వాతావరణం అంతా సందడిగా ఉంది. మధ్యమధ్య మీనాక్షి హోటల్లో పెనం మాటిమాటికీ సుయ్- సుయ్- మని చప్పుళ్లు చేస్తోంది.

సెంటర్లో శబ్దాలకే మెలకువ వచ్చిందో, క్షణక్షణానికీ వేడెక్కుతున్న ఎండ చుర్రుమనిపించిందో తెలియదు గానీ రాత్రంతా బస్టాండు గచ్చుమీద ఒళ్లెరగకుండా పడుకున్న వీరిగాడు చింకి దుప్పటిలోంచి తలబైటికి పెట్టాడు.

వెలుతురుని తిట్టుకుంటూ కాసేపు గెడ్డం బరుక్కున్నాడు. లేచి కూర్చుని ఎదురుగా తన సంచినీ, అడుక్కుతినే మూతలేని స్టీలు క్యారేజీని ఆప్యాయంగా చూసుకున్నాడు. పొద్దెంత ఎక్కిందో ఓసారి గమనించాడు. రోజూకంటే కాస్త ఆలీస్యంగానే లేచానేమో అనుకున్నాడు.

"తొరతొరగా బయల్దేరాలి. ఎవరేనా కాస్తంత టీ పోయిస్తే తాగేసి ఊరిమీదికెళ్లాలి. పొద్దుపోతే చద్దన్నాలు కుడితి తొట్లోనో, చెత్తకుండీలోనే ఒంపేస్తారు. ఆనక మధ్యాహ్నం దాకా మాడి చావాలి" అనుకుంటూ గబగబా సంచి బుజాన తగిలించుకుని క్యారేజీ చేతిలోకి తీసుకున్నాడు. ఒక్కసారిగా కళ్లు మిరుమిట్లు గొలిపాయి.

గుండె ఒక్కక్షణం కొట్టుకోవడం కూడా మానేసిందేమో! ఒకసారి కళ్లు నులుముకున్నాడు. చేత్తో తాకితే కంటికి కనిపించేది కలలోలాగా మాయమైపోతుందేమో అని ఒకసారి భయపడ్డాడు. కంటికి కనిపించేదాన్ని కలేమో అని వదిలేయడం ఎలా సాధ్యపడుతుంది? చేత్తో తడిమి చూశాడు. ఓర్నాయనో... నిజమే! గట్టిగా అరవబోయి నాలిక కరుచుకున్నాడు. ఎవరూ చూడటం లేదని నిర్ధారించుకుని ఆ రెండు కాగితాలని తీసి తన చిరుగుల సంచిలో లోపలికంటా తోసి దాచిపెట్టాడు. పరుగు పరుగున బయల్దేరాడు.

మీనాక్షి హోటల్ కేసి రెండడుగులు వేసినవాడే మళ్ళీ ఏదో గుర్తుకు వచ్చినట్లు రూటు మార్చాడు. ఉత్తరం వైపుకి నడక సాగించాడు. ఎక్కడా ఆగకుండా ఊరి చివరకి వచ్చేశాడు....

"లిఖిత వైన్స్" బోర్డు ముందు షాపు కుర్రాడు సుందరం చెత్త ఊడుస్తున్నాడు. వీరిగాడు రావడం గమనించి అడిగాడు.

"పొద్దున్నే ఇటొచ్చావేంట్రోయ్..."

"ఓ గళాసు కావాలి."

“అబ్బా… పొద్దున్నే నీకు గళాసు డబ్బులేసిన షావుకార్లెవర్రోయ్ మనూళ్లో”

“ఎవరో మగానుభావులు ఉంటార్లే, అయ్యన్నీ నీకెందుకు. మాట్టాడకుండా మందుపోయ్”

“అబ్బో ఏం గీర్వాణంరా! కాసేపాగు. మా ఓనరొచ్చి పూజ్జేసుకుంటే గానీ, బేరాలు మొదలెట్టడానికి లేదు.”

“తాళాలు నీకాడే ఉంటాయ్ కదో! కాస్తంత పోద్దూ… అయినా పెద్ద బేరాలైనా తానొచ్చిందాకా అమ్మొద్దన్నాడా మీ షావుకారు?”

“ఏడిశావులే… నువ్వు తాగే ఒక్క గళాసుకి ఫుల్లుబాటిలు తాగేవోడిలా పోజులు పెట్టకు.”

“ఒక్క ఫుల్లేట్రా… ఇయ్యాల నానొక్కణ్ణే అయిదు ఫుల్లులు లాగించేత్తాను. వీరమత్తెక్కిపోవాల. యమా కులాసా చేసుకోవాల.”

“ఏట్రా రేత్రి ఎక్కణ్ణా కన్నవేశావేటి?”

“కన్నవేసే పని మాకేల్రా. అడుక్కుంటాం, కట్టపడి అడుక్కుంటాం. ఏమారాజైనా నాలుగు డబ్బులేస్తే ఇదిగో ఇలా సుఖపడతాం. ముందు యాపారం చేసే ఉద్దేశం ఉందా లేదా చెప్పు.”

“ఏట్రా మంచి జోరుమీదున్నావ్. ఏటి కత ఎంతబేరం పట్టుకొచ్చావేంటి?” అనుమానంగా అడిగాడు సుందరం.

“ప్రస్తుతానికి ఒక ఫుల్లేసుకో." అన్నాడు వీరిగాడు దర్జా ఒలకబోస్తూ.

అతని వాలకం సుందరానికి ఆశ్చర్యం కలిగించింది. “ఏవన్నా తిన్నావా? ముందు కాస్త తిని రా.” అన్నాడు సుందరం అప్పటికీ నమ్మలేనట్లుగా.

“దీనవ్వ తిండికేట్రా.. సీపుగా ఇడ్లీలు, అట్లు తింటాననుకున్నావా. ఇయ్యాల ఏటమాంసం పడాల్సిందే. ముందు సీసా రానియ్” అన్నాడు వీరిగాడు జోరుగా.

సుందరం షాపు షట్టర్ పైకెత్తి లోపలికెళ్లిసీసా తీసి టేబుల్ మీద పెట్టాడు. కొత్తగా పెళపెళలాడుతున్న వెయ్యి రూపాయల నోటు తీసి చేతికందించాడు వీరిగాడు. తన కళ్లను తానే నమ్మలేకపోయాడు సుందరం.

“ఏరా! నిజంగా కొట్టుకొచ్చిన బాపతు కాదు కదా!”

“కాదులే గానీ... ముందు సోడాకాయి కొట్టించవోయ్”

“తేడాలొస్తే మక్కెలిరగ్గొట్టేస్తార్రా! చెప్పు నిజంగా ఏ పాడుపనీ చెయ్యలేదు కదా!”

“పిరికి ఎదవా! నా బొచ్చెలో పడ్డ సొమ్ములేరా! మనం ఎవురికీ అన్నాయం సెయ్యం” అప్పటికే మందుసీసా తెరిచేసి ఆత్రంగా కాస్తంత తాగేశాడు వీరిగాడు. తెగమంటపుట్టేసింది.

“సోడా సోడా” అని అరిచాడు.

“దొంగతనం చేస్తే పోలీసులొస్తార్రా! నీకే హాయిగా పోయి జైల్లో కూచ్చుంటావ్. మా షావుకారు నా ఉద్యోగం పీకేస్తాడు” ఇంకా భయంగానే అడిగాడు సుందరం సోడా అందిస్తూ.

“నీకా భయమేం అక్కర్నేదు. నానెప్పుడైనా పోలీసుస్టేషను గుమ్మం తొక్కంగా చూశావా? మిగతా సిల్లరిచ్చేయ్.”

“ఊహు... ఇవ్వను. కావాలంటే తిండికి డబ్బులిస్తా. సాయంత్రం లోపు ఈ వెయ్యి రూపాయల కోసం ఎవరూ రాకపోతే అప్పుడు సిల్లరిత్తా”ముందు జాగ్రత్త పడ్డాడు సుందరం.

“నీ మీద నాకు నమ్మకమేలే. అలాక్కానీ. అందాకా ఓ మూడొందలు కొట్టించు. మద్దినేల మాంసం కూర తింటా” విలాసంగా చెప్పాడు వీరిగాడు.

గల్లాలో వెయ్యినోటు వేసి ఏడు వంద కాగితాలు తీసాడు. మూడు వీరిగాడికి ఇచ్చి మిగిలిన నాలుగూ తన జేబులోకి తోసాడు.

"ఆహా పొద్దున్నే మాలచ్చి కరుణించింది. యీడు మళ్లావొచ్చి మిగతా చిల్లరిమ్మని అడిగితే నీకెక్కడియిరా అన్ని డబ్బులని బెదరెయ్యొచ్చు. ఇయ్యాల

రేత్రికి మనం కూడా ఇరగెయ్యాలి" అనుకున్నాడు సుందరం.డబ్బులిస్తూ "ఆరగారగా తాగు. జాగ్రత్తరోరేయ్. ఎండిన పేగులమీదికి మొత్తం అంతా పట్టించేశావ్ గాక" అని వీరిగాణ్ణి హెచ్చరించాడు.
"మాకు తెల్సులేవోయ్" అంటూ సీసాని చిరుగుల సంచిలో పైకి కనిపించకుండా జాగ్రత్తగా పెట్టుకుని వెళ్లిపోయాడు వీరిగాడు.
రోడ్డెక్కిన వీరిగాడు తిన్నగా ఊరు మధ్యలోంచి నడిచెళ్లిపోయాడు. మీనాక్షి హోటల్ ముందు ఆగలేదు. ఏ ఇంటిముందూ ఆగి బిచ్చం అడుక్కోలేదు. నడిచి నడిచి ఊరికి మరో చివరికి చేరుకున్నాడు. దారిలో వైన్ షాపులో ఇంకో సీసా కొనేశాడు. మరింకేమీ ఆలోచించకుండా చింత తోపుల కేసి వెళ్లిపోయాడు. ఎవరూ సాధారణంగా రాని చోటు చూసుకుని ఆబగా తాగడం మొదలెట్టాడు.
ఎవరి పనుల్లో వాళ్లు బిజీబిజీగా ఉన్నారు. పొద్దెక్కి షాపుకి వచ్చిన యజమానికి ఒక సీసా లెక్క మాత్రమే చెప్పాడు సుందరం. అతనూ పెద్ద పట్టించుకోలేదు. మధ్యాహ్నం వరకూ షాపులోనే ఉండి.... అప్పటివరకూ వసూలైన మొత్తాన్ని బ్యాంకులో వేసేసి భోజనానికి వెళ్లిపోయాడు యజమాని.
సుందరం తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు. తాను కాజేసిన నాలుగువందల విషయం బయటపడలేదు కదా అని అప్పటికి తృప్తి పడ్డాడు. కానీ ఇక్కడ అతను చేసిన పనికి ఎక్కడో రాజధాని వరకూ ఒక లింకు ఉందని, కొద్దిసేపట్లో తాను చిక్కుల్లో పడబోతున్నానని అతనికి తెలీదు.

**

హైదరాబాద్

సెక్రటేరియట్ లోని హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాంకుమార్ చాంబర్.

దాదాపు గంటసేపటి నుంచి విజిటర్స్ ఎవరినీ చాంబర్ లోపలికి అనుమతించడం లేదు. అప్పాయింట్ మెంట్లన్నీ నిలిపివేయబడ్డాయి. వరుసగా ఏవో ఫోన్లు మాట్లాడుతూనే ఉన్నాడు రాంకుమార్. ఊ...యా...నో అంటూ రాంకుమార్ మాట్లాడిన పొడిమాటల్లో అవతలి వ్యక్తులు మాట్లాడుతున్న విషయమేమిటో పొంచి విన్నా మరేవ్యక్తికీ అర్థం కాదు.

కాసేపటి తర్వాత రామ్ తనంతట తానుగా ఒక కాల్ చేశాడు. అవతలి వ్యక్తి హలో అన్నాడు.

"సార్! కుడ్ ఐ రీచ్ యు నౌ" రాంకుమార్ అడిగాడు.

"ఇప్పుడు కుదరదు. అన్నట్టు ఎనీ బ్రేకింగ్ న్యూస్?"

"ఎస్ సార్! ఆ కేసుకి సంబంధించి ఒక క్లూ దొరికింది."

"గో ఎహెడ్... చిన్న ఆధారాన్ని కూడా విడిచిపెట్టద్దు."

"ఓకే సార్"

"మిస్టర్ కుమార్... బాటమ్ లైన్ మర్చిపోవద్దు. కీప్ ఇట్ కాన్ఫిడెన్షియల్. ఇప్పటికే ఇది మూడోరోజు. వీలైనంత త్వరగా మనం ఈ ఆపరేషన్ పూర్తిచేయాలి. దానికోసం మీరెలాంటి స్టెప్స్ తీసుకున్నా నా కోఆపరేషన్ ఉంటుంది."

"థాంక్యూ సార్"

ఆ సంభాషణ తర్వాత రాంకుమార్ తీవ్రమైన ఆలోచనలో పడిపోయాడు. దాదాపు మూడు రోజుల తర్వాత ఈ కేసుకు సంబంధించి ఒక కదలిక వచ్చింది. కానీ ఈ ఆపరేషన్ నడిపించడానికి సమర్థుడైన అధికారి కావాలి. ఎవరా వ్యక్తి అని ఆలోచిస్తున్నాడు రాంకుమార్.

కొద్దిసేపటి తర్వాత ఫ్లాష్-లా అతని బుర్రలో ఒక రూపం మెదిలింది. వెంటనే తన మొబైల్ తీసుకుని ఒక మెసేజ్ ఇలా రాశాడు.

""""మీట్ మిస్టర్ వరదరాజులు. టుమారో ఎట్ 8''

**

భోజనం తర్వాత లిఖిత ఫైన్స్ యజమాని మళ్ళీ షాపుకొచ్చేసరికి సాయంత్రం నాలుగయ్యింది. అతను వచ్చిన కాసేపటికి ఒక ఫోన్ కాలొచ్చింది. ఫోను మాట్లాడేసి హడావుడిగా బయలుదేరి బయటికెళ్లిపోయాడు.

గంట గడిచింది.

షాపుముందు ఆగిన బైకు మీంచి ఎవరో కానిస్టేబుల్ దిగాడు. సూటిగా లోపలికొచ్చి సుందరాన్ని ఉద్దేశించి, లాఠీ చూపిస్తూ ''పదరా స్టేషనికి'' అన్నాడు.

"మా ఓనరొచ్చాక వస్తానండీ" బెదురుతూ అన్నాడు సుందరం.

"ఆయన కూడా అక్కడే ఉన్నాడు కానీ నువ్వు నడువ్" అన్నాడు కానిస్టేబుల్ కఠినంగా. షాపు తాళం వేసే దాకా కూడా ఆగకుండా హడావుడి చేసి లాక్కుపోయాడు .

సుందరం భయం భయంగా ఎస్సై రూంలో అడుగుపెట్టేసరికి అక్కడ కుర్చీలో షాపు యజమాని భయమో, కోపమో తెలియని అవస్థలో ఉన్నాడు.

"ఏరా ఈ వెయ్యి నోటు ఎక్కడిది నీకు?" గర్జిస్తున్నట్లుగా అడిగాడు ఎస్సై.

"నిజంగా నాకేమీ తెల్దండీ, దొంగ సొమ్మేమో అని ముందు అమ్మనన్నానండీ. కానీ ఆడు దొంగతనం చేయలేదని సత్యపెమానకంగా చెప్పాకే అమ్మానండీ."

"ఎవడికిరా నువ్వమ్మింది?"

"ముష్టెత్తుకునే ఈరిగాడికండీ."

"నీయబ్బ... ఏ ముష్టి నాకొడుకొచ్చి డబ్బులిచ్చినా సీసా ఇచ్చేయడమేనా... ముందుఎనకా చూసుకోనక్కర్లే" సుందరాన్ని కొట్టినంత పని చేశాడు షావుకారు.

"నిజంగా ఎవరో ముష్టిసారన్నాడండీ."

"ఎన్నింటికి వచ్చాడాడు షాపుకి?"

"ఏడవుద్దనుకుంటానండీ"

"నిజంగా వాడే ఇచ్చాడా?"

"నిజంగా నిజమండీ. అడుక్కుతినేవాడు వెయ్యిరూపాయలు ఇస్తే విచిత్రమే కదండీ"

"కదా! మరి అంత విచిత్రం మీ ఓనరుకెందుకు చెప్పలేదో?"

"అదండీ.. అదండీ" ఓనరు వంక అనుమానంగా చూశాడు.

వాడి చూపులకు ఓనరు కంగారు పడి "చెప్పరా ఎదవా?" అని గదిమాడు.

"ఆడి మీద అనుమానంతో ఆడికి ఒక బాటిలూ, కొంత చిల్లరా ఇచ్చి మిగిలినవి నా దగ్గరే పెట్టుకున్నానండీ. అందుకనీ"

"ఓహో, వాడు ఎవణ్ణో అడుక్కుతింటే నువ్వు వాణ్ణే గీక్కుతిందామనుకున్నావన్నమాట"

"ఇదిగో శంకరం. ఆ వీరిగాడు ఎక్కడున్నాడో పట్రా. వాడొచ్చేదాకా వీడిని ఇక్కడే ఉంచండి" అని కానిస్టేబుల్ తోనూ; "సరే. మీరు వెళ్ళండి. ఏదైనా అవసరమైతే మళ్ళీ కబురుచేస్తా" ఓనరుతో చెప్పాడు ఎస్సై. బతుకు జీవుడా అని బయటపడ్డాడు ఓనరు. అతని వెనుకే నలుగురు పోలీసుల బృందం వీరిగాడి వేటకి బయల్దేరింది. అక్కడక్కడా విచారించుకుంటూ ముందుకు కదిలింది. ఈ కొద్దిసేపటిలోనే ఏమని ఉప్పందిందో కానీ, ప్రెస్ అని రాసి ఉన్న బైకొకటి పోలీసుల బృందాన్ని అనుసరించింది.

# 2

అనాయాసంగా మరణించడానికి ఎంతో అదృష్టముండాలి.

న్యూస్ పేపరు మొదటిపేజీలో ఫోటో పడాలంటే ఎంతో కొంత ఎక్కువ అదృష్టముండాలనుకుంటారు.

ఆ రోజు ఆ అదృష్టం వీరిగాడి ఫోటోకు దక్కింది. కానీ ఆ ఫోటో వీరిగాడి శవానిది కావడమే అసలు దురదృష్టం. దాదాపుగా అన్ని పేపర్లూ ఆ కథనాన్ని మొదటిపేజీలో ప్రముఖంగా ప్రచురించాయి.

బిచ్చగాడా? తీవ్రవాదా?

టైం న్యూస్, పెదపాడు: పశ్చిమగోదావరి జిల్లా పెదపాడులో సోమవారం అనుమానాస్పద పరిస్థితులలో మరణించిన వీరయ్య ఉరఫ్ వీరిగాడి నేపథ్యం ప్రశ్నార్థకంగా మారింది. అధికారికంగా ధృవీకరించక పోయినప్పటికీ వీరయ్య మారువేషంలో ఉన్న తీవ్రవాది కావచ్చునని పోలీసులు భావిస్తున్నారు. పెదపాడు శివారులోని చింతలతోపులో మద్యం సీసాతోనూ, వెయ్యిరూపాయల నోటుతోనూ ఉన్న వీరయ్య మృతదేహం పోలీసులకు లభ్యమయ్యింది. కానీ అతనికి కరడుకట్టిన తీవ్రవాది, ప్రముఖ తీవ్రవాద ముఠా అగ్రనాయకుడు సులేమాన్ పోలికలు కనిపిస్తున్నాయన్ని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఒకవేళ అదే నిజమైతే అంత కరడుకట్టిన తీవ్రవాది పెదపాడు ప్రాంతంలో ఎందుకున్నాడన్నది మిస్టరీగా మారింది. పరిస్థితులు బాగోనప్పుడో, భారీ ఎత్తున విధ్వంసాలకు పథకాలు వేస్తూ, వాటికి కావాల్సిన డబ్బులూ ఆయుధాలు సమకూర్చుకుంటున్న సమయంలో తీవ్రవాదులు ప్రశాంతమైన పల్లెటూళ్లల్లో రహస్యంగా నివసిస్తారని ఇంటిలిజెన్స్ వర్గాలు చెబుతున్నాయి. అదే విధంగా సులేమాన్ కూడా ఈ ప్రాంతంలో మారువేషంలో నివసిస్తున్నాడని

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=2642**

* * *